క్లుప్తంగా

ఘనంగా గౌరీ శంకర వసంతోత్సవం



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తంగెళ్లమూడి గవరపేటలోని గౌరీ శంకర ఆలయ ప్రాంగణంలో ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వసంతోత్సవం, ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అర్చకుడు కృష్ణమూర్తి భక్తుల గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేసిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక చత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న గర్భిణులకు రక్తం అవసరమని తెలియడంతో విద్యార్థులు ఎల్ వెంకట అరవింద్, పి.గంగాధర్‌లు ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ ప్రసాద్‌బాబు, వి.హనుమంతరావు, వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మట్టా మధు, రెడ్‌రిబ్బన్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

78 మందికి వైద్య పరీక్షలు



కొక్కిరపాడు గ్రామంలో దంత వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదపాడు: ప్రతి ఒక్కరూ దంత సంరక్షణ చేసుకుని నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల ప్రజాదంత వైద్యవిభాగం హెచ్ఓడీ పావన సంధ్య సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సెయింట్ జోసఫ్ డెంటల్ వైద్యులు కొక్కిరపాడు, వేంపాడు, దాసరిగూడెం గ్రామాల్లో 78 మందికి ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత వ్యాధులు, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మరీదు రెడ్డియ్య, టి.ప్రసాంత్ తదితరులు పాల్గొన్నారు. .

యువకుడికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సు మోటార్ సైకిలిస్టును ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన యువకుడు విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై షేక్ జబీర్ తెలిపిన వివరాలు ప్రకారం.. జంగారెడ్డిగూడెం పట్టణంలో సెల్‌ఫోన్ మెకానిక్ షేక్ అహ్మద్ షరీఫ్ ఈ నెల 6న సాయంత్రం తన స్నేహితుడిని గుర్వాయిగూడెంలో దించి, తిరిగి జంగారెడ్డిగూడెం వస్తుండగా స్థానిక సాయిబాబ స్థూపం వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. షరీఫ్ తలకు బలమైన గాయమవడంతో స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, షరీఫ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం

- ఏలూరులో పార్టీ కుటుంబ ఆత్మీయ సమావేశం
- మార్మోగిన జై జగన్ నినాదాలు



సమావేశంలో సమన్వయకర్తలు బాలరాజు, విజయరాజు, ముఖ్య నేతలతో ఏలూరు సమన్వయకర్త జేపీ



మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్లమెంట్ ఇన్‌చార్జి సునీల్‌తో మాట్లాడుతున్న సమన్వయకర్త జేపీ



పార్టీ నాయకులు శ్రీనివాసరావు, విజయనిర్మల, చిరంజీవిలతో జయప్రకాష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ జెండా ఏలూరు నగరంలో రెపరెపలాడింది. పార్టీ శ్రేణులు, నేతలు నగరంలో కథంతొక్కారు. పార్టీ జెండాలను మోటారు సైకిళ్లు, కార్లకు పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. 10 నెలల కూటమి ప్రభుత్వ కంటక పాలనకు చెరమగీతం పాడేందుకు ఇప్పటి నుంచే తామంతా సిద్ధమంటూ నినదించారు. ఏలూరు మినీబైపాస్‌లోని క్రాంతి కల్యాణ మండపంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జిల్లా కార్యకర్తల, నేతల ఆత్మీయ సమావేశం శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. కల్యాణ మండప ప్రాంగణం, సమావేశ మందిరం జై జగన్ నినాదాలతో మారుమోగింది.

ఏడాది పూర్తికాకుండానే వ్యతిరేకత

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తికాకముందే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకుంటోంది. కూటమి సర్కార్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టినా, దౌర్జన్యం చేసినా, దాడులు చేసినా, బెదిరేదిలేదంటూ శ్రేణులు భారీ సంఖ్యలో సమావేశానికి హాజరయ్యారు. మరోవైపు మండలి ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ మాట్లాడుతున్నంత సేపు కార్యకర్తలు ఈలలు, చప్పట్లు, నినాదాలతో హోరెత్తించారు. పార్టీ నేతలతో తామంతా ఉన్నాం.. జై జగన్ అంటూ నినదించారు. నేతల ప్రసంగాలతో శ్రేణులు ఉత్సాహంతో ఊగిపోయారు.

సైనికుల్లా పనిచేద్దాం

పేదల పక్షపాతి, సంక్షేమ రథసారధి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నేతలు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేద్దామని పార్టీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ పిలుపునిచ్చారు. నాడు దివంగత మహానేత వైఎస్సార్ రాష్ట్రంలో నూతనంగా సంక్షేమ పాలనతో ప్రజల గుండెల్లో నిలిచిపోయారని, గత ఐదేళ్ల ప్రజారంజక పాలనతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాలను గెలుచుకున్నారని గుర్తుచేశారు. గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏలూరు నగరం అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ పాలన కావాలన్నారు. గత ఐదేళ్లలో ఏలూరులోని ప్రతి కుటుంబానికి మేలు చేశామని, ప్రజలకు జగన్ చేసిన సంక్షేమం గుర్తుందని వివరించారు. పార్టీ నగర మహిళాధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలనతో ప్రజలను భయపెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని, పార్టీ కార్యకర్తలు ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని అన్నారు. సమావేశానికి పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్ బాబు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లి శ్రీనివాస్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రాజేష్, ఎస్సీ సెల్ నగరఅధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, నగర కార్పొరేటర్లు మునగాల కేదారేశ్వరి, కిలాడి జ్యోతి, తుమరాడ స్రవంతి, ఆయేషా సుల్తానా, డింపుల్ జాబ్, ఇమ్మానుయేల్ జయకర్, తంగెళ్ల రాము, మైనార్టీ సెల్ నాయకులు ఎండీ కైసర్, రియాజ్ బాషా, తులసీ వర్మ, తులసీ, బండ్లమూడి సునీల్‌కుమార్, కొల్లిపర సురేష్, గాజుల బాజీ, గంటా సాయి, బళ్ల రమేష్, సుజన్, మేతర సురేష్ తదితరులు ఉన్నారు.

పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రం పెంచిన గ్యాస్ ధరను ఉపసంహరించుకోవాలని, పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రద్దుచేసి లీటరుకు రూ.2 తగ్గించాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లకు, ఉజ్వల పథకం లబ్ధిదారులకు రూ.50 చొప్పున కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం దారుణమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గాయని, అందుకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ ఎంపీల మద్దతుతోనే కేంద్రంలో బీజేపీ పాలన సాగిస్తుందని, ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేసేటప్పుడు నిలదీయాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు.

ఏసుక్రీస్తు సువార్త మహాసభలు

దెందులూరు: దేవునికి దీవెనకరంగా ప్రతి ఒక్కరు జీవించాలని ప్రముఖ సువార్తికులు జాన్ వెస్లీ అన్నారు. దెందులూరు మన్న చర్చి పాస్టర్ బెంజిమెన్ సంఘస్తులు సంయుక్త ఆధ్వర్యంలో ఎస్ఎంఆర్ నగర్‌లో ఏసుక్రీస్తు సువార్త మహాసభలు రెండో రోజు కొనసాగాయి. జాన్ వెస్లీ మాట్లాడుతూ దేవుని సువార్త దశదిశలా ప్రకటించబడాలన్నారు. ప్రతి ఒక్కరూ దేవుని ఆజ్ఞలకు అనుగుణంగా ఆయన చూపిన మార్గంలో నడుస్తూ రక్షణ పొందాలని కోరారు. ఈ సందర్భంగా పాస్టర్ బెంజిమెన్ దెందులూరు మండలం పాస్టర్ అసోసియేషన్ గౌరవ పాస్టర్ విలియం సంఘం పెద్దలు సభ్యులు యువత నూతన గీతాన్ని ఆవిష్కరించారు.

ఈదురుగాలుల బీభత్సం



ఇండోర్ స్టేడియం వద్ద వ్యాపించిన మంటలు



సుబ్బమ్మ దేవి స్కూల్ రోడ్డులో తీగలపై పడిన కొమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తీక్షణమైన ఎండతో భారీగా ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశంలో కారుమబ్బులు ఏర్పడ్డాయి. ఈదురు గాలులు వీచాయి. కొద్ది సేపు పెద్ద పెద్ద చినుకులతో వర్షం పడింది. ఈదురు గాలుల ప్రభావానికి ఏలూరు ఇండోర్ స్టేడియం సమీపంలో చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో మంటలు చెలరేగాయి. సుబ్బమ్మదేవి స్కూల్ రోడ్డులో ఒక చెట్టు కొమ్మ విద్యుత్ తీగలపై పడింది. కొత్త బస్టాండు సమీంలో మరో చెట్టుకొమ్మ తీగలపై పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తీగలపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నరసింహారావుపేటలో సాయంత్రం 6.30 గంటలకు ఆగిపోయిన విద్యుత్ సరఫరా రాత్రి 9.30 గంటల వరకు పునరుద్ధరణ కాలేదు. నరసింహారావు పేట నివాసితులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.



ఏలూరులో ఆకాశంలో కమ్ముకున్న కారుమబ్బు



ఈదురుగాలులకు చిరిగిన ఫ్లెక్సీలు



విద్యుత్ సరఫరా లేక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో..

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



ఉద్యోగికి కంటి పరీక్ష చేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యుత్ సంస్థ ఉద్యోగులు ఆరోగ్యం కోసం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశామని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు తెలిపారు. విద్యుత్ సంస్థలో ఏలూరు సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రాంభించారు. ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ ప్రతినిధులు ఉద్యోగులకు అన్ని రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఉద్యోగ సంఘ నాయకులు తురగా రామకృష్ణ మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాలు నిర్వహించి తమ ఆరోగ్య భద్రతకు చర్యలు తీసుకుంటున్న ఎస్ఈ సాల్మన్ రాజుకు, సర్కిల్ మేనేజ్మెంట్‌కు ఉద్యోగుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు భూక్యా నాగేశ్వరరావు, ఎం రమేష్, వి.రాము, పి.శ్రీనివాస్, ఎ.శ్రీనివాస్, ఎస్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

10న వంతెన కోసం పాదయాత్ర

జంగారెడ్డిగూడెం: పట్టిన్నపాలెం వంతెన నిర్మించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 10న నిర్వహించే పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జంగారెడ్డి మండల కార్యదర్శి ఎం జీవరత్నం కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పట్టిన్నపాలెంలో వంతెన బుట్టాయిగూడెం మండలం గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లే ప్రధాన రహదారిగా ఉందని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం గత టీడీపీ ప్రభుత్వం 2014లో పనులు సంగం చేసి ఆపేసిందని వివరించారు. వాగు పొంగి ఇప్పటి వరకు ఎనిమిది మంది మృత్యువాత పడ్డారని గుర్తుచేశారు. ఈ నెల 10న పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు టి.రామకృష్ణ, టి.నాగమణి ఆధ్వర్యంలో పట్టిన్నపాలెం వంతెన నుంచి జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం వరకు 100 మందితో పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు, పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు ఏలూరు అర్బన్ ఇన్‌చార్జి సీడీపీఓ కె.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వివాహిత మహిళలు అర్హులని, జూలై 1వ తేదీ నాటికి 21 నుంచి 35 ఏళ్ల లోపు వయసు ఉండాలని, కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. అదనపు విద్యార్హతలకు ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. ఈ నెల 17వ తేదీ లోగా దరఖాస్తులను ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు, స్విమ్మింగ్ పూల్ వెనుక, ఏఎస్ఆర్ స్టేడియం, రైల్వే స్టేషన్ వద్ద ఏలూరు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు జూనియర్ అసిస్టెంట్ కె.వెంకటేష్ సెల్ నెంబర్ 99493 69004లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఖాళీలివీ..

ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి : వంగాయగూడెం, వెంకటాపురం-1 (సుంకర వారి తోట), బాప్టిస్ట్ పేట, కొబ్బరి తోట-3, శాస్త్రి సెంటర్, కుమ్మర గొయ్య (శనివారపు పేట), తంగెళ్లమూడి-1, -2, పైడి చింతపాడు, మొండెల కాలనీ (వెంకట పురం -2), బోరాయి గూడెం (వెంకటపురం-8), మొండికోడు, కొమడవోలు-3, ఫిరంగుల దిబ్బ-1, పెద యాగనమిల్లి.

పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి : బాపిరాజు గూడెం-2, రాయన్నపాలెం-3, సీతారంపురం, ఏపూరు, రామసింగవరం-1, వేగివాడ-1, జగనాథపురం-1, చింతలపాటివారిగూడెం, వడ్డిగూడెం, వసంతవాడ-3, పెదపాడు, శ్రీరామవరం -2, పోతునూరు-1, మలకచర్ల, అంజలిపురం, సత్యనారాయణపురం, సానిగూడెం.

పొలాల పరిశీలన

పెదపాడు: వరి పంటను భద్రపరుచుకోవాలని తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి, వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్‌లు రైతులకు సూచించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పెదపాడు మండలం ఏపూరు గ్రామంలో వరి పంట పొలాలను వారు పరిశీలించారు. రైతులకు తగిన సూచనలు చేశారు. ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక వీఆర్వో నటరాజన్‌దాసు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

వేలేరుపాడు: పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజా పందా నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులతో కలిసి వారు ఆందోళన చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ప్యాకేజీ ఇవ్వాలని, ప్రభుత్వం ఇచ్చిన రూ.6 లక్షలకు వడ్డీ కట్టి ఇవ్వాలని, వేలేరుపాడు మండలం మొత్తం యూనిట్‌గా తీసుకొని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు కట్ట వీరస్వామి, సర్పంచ్‌లు కట్టడం రాంబాబు, మడి రంగమ్మ, సోడా విజయ, ఎంపీటీసీ సభ్యులు కతం రత్తమ్మ, తరం తమ్మయ్య, డివిజన్ నాయకులు కారం సత్యవతి, కారం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాదీ సాగునీటి కష్టాలు తప్పవా?

- ఆంధ్రా కాల్వ మరమ్మతులపై నిర్లక్ష్యం
- రైతుల ఆందోళన



గణిజర్ల గ్రామం వద్ద ఆంధ్రా కాల్వ దుస్థితి



చింతకాయల కొత్తగూడెం వద్ద కాల్వలో ముళ్ల పొదలు

చింతలపూడి: ఆంధ్రా కాల్వకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ఈ ఏడాది సాగునీటి కష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మెరక తేలి పూడిక, ముళ్ల పొదలతో పూడుకుపోయిన ఆంధ్రా కాల్వ కొంత కాలానికి కనుమరుగు అవుతుందేమోనని వాపోతున్నారు. చింతలపూడి మండలంలో ని 21 చెరువులకు సాగు నీరు అందించడానికి ఖమ్మం జిల్లా తు మ్మూరు వద్ద ఆనకట్ట నిర్మించారు. అక్కడి నుంచి వరద నీటిని సాగునీటి చెరువులకు మళ్లిస్తారు. 1967లో 18 కిలో మీటర్ల పొడవున కాల్వ తవ్వారు. దీంతో చింతలపూడి మండలంలో దాదాపు 11 వేల ఎకరాలకు ఏటా సాగునీరు అందుతుంది. అయితే అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా ఆంధ్రా కాల్వ పూడుకుపోయి సాగు నీటి సరఫరాకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు మైనర్ ఇరిగేషన్ పరిధిలో ఉన్న ఈ కాల్వకు వర్షాకాలంలో అనేక సార్లు గండ్లు పడటం, మరమ్మతులు చేయడం ఆనవాయితీగా మారింది. గతంలో చింతలపూడి మండలం గణిజర్ల గ్రామం వద్ద ఆంధ్రాకాల్వకు అనేక సార్లు గండ్లు పడ్డాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు గండి పూడ్చి వేతలో రూ.లక్షలు దండుకుంటున్నారే తప్ప, శాశ్వత చర్యలు చేపట్ట లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ వేసవిలో నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టకపోతే ఆంధ్రా కాల్వ నుంచి వచ్చే వరదనీరు వృథాగా పోతుందని ఆందోళన చెందుతున్నారు. శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, ఆంధ్రాకాల్వ పూడిక తీత పనులను చేపట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఆంధ్రా కాల్వ మరమ్మతులకు నిధులు కేటాయించాలి. తుపానుకు పడ్డ గండిని పూడ్చి, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలి. వరదలు వస్తే గండిని పూడ్చక పోవడం వల్ల వరద నీరు పొలాలపై ప్రవహించి, వృథాగా పోతుంది.

– గద్దె ప్రసాద్, రైతు, యండపల్లి

రైతులను అప్రమత్తం చేయండి

దెందులూరు: వాతావరణ మార్పుల నేపథ్యంలో ధాన్యాన్ని త్వరితగతిన గోదాములకు పంపేలా రైతులను అప్రమత్తం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం దెందులూరు కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులందరికీ నాణ్యమైన గోనె సంచులు, ధాన్యం తేమ శాతం విషయంలో ఒకటి రెండు సార్లు నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని అన్నారు. ధాన్యం ఒబ్బిడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ హబీబ్ బాష, డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్ రెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, ఆర్ఐ హేమమాలిని, మండల వ్యవసాయ శాఖ అధికారి దామా వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

గణపవరం: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఆస్పత్రిలోనే ప్రసవం చేయించుకోవడం క్షేమదాయకమని గణపవరం పీహెచ్‌సి వైద్యాధికారిణి పి.కిరణ్మయి అన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశాడే సందర్భంగా మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులను ఎర్లీగా రిజిస్ట్రేషన్ చేయడం, హైరిస్క్ వారిని గుర్తించి తగిన వైద్యసేవలు అందించడం, రక్తహీనత లేకుండా ఐరన్ మాత్రలు ఇవ్వడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రతి ఆశ వర్కర్ దగ్గర ప్రెగ్నెన్సీ కిట్లు కనీసం పది సిద్ధంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తులసి మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	22
ఏలూరు – తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	27
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు – తిరుపతి	16.00	4830	34